సాక్షి గుంటూరు

బుధవారం । 23 । జూలై । 2025



ఆలయానికి విరాళం

నాదెండ్ల: సాతులూరులోని గ్రామ దేవతల ఆలయ భోజనశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కేవీ రెడ్డి రూ.51,116 విరాళంగా అందించారు.



కార్తికేయుని సన్నిధిలో ..

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని విజిలెన్స్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఎల్.వి.రమణమూర్తి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు.

శాకంబరిదేవిగా సీతాలాంబ



నాదెండ్ల: సాతులూరులోని బండారుపల్లి వారిపాలెంలో కొలువై ఉన్న సీతాలాంబతల్లిని ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం శాకంబరిదేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లాలో గత ఆరు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 82.8 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా పెదకాకాని మండలంలో 10.2 మి.మీ. కురిసింది. సగటు 43.1 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. వట్టిచెరుకూరు మండలంలో 80.2 మి.మీ., ప్రత్తిపాడు 70.6, గుంటూరు పశ్చిమ 70.2, గుంటూరు తూర్పు 66.2, పెదనందిపాడు 64.6, ఫిరంగిపురం 62.4, కాకుమాను 50.4, మేడికొండూరు 45.4, కొల్లిపర 37.2, పొన్నూరు 27.8, దుగ్గిరాల 22.8, మంగళగిరి 21, తెనాలి 20.2, తాడేపల్లి 17.4, తుళ్ళూరు 14.8, తాడికొండ మండలంలో 12.4 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూలై 22వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 117 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 188.4 మి.మీ. నమోదైంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులు ముమ్మరం చేశారు.

వర్షపు నీటిలోనే వెన్‌లాక్ మార్కెట్




నెహ్రూనగర్: మూడు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు నీట మునిగిన విషయం తెలిసిందే. నగరపాలక సంస్థ కార్యాలయం పక్కనే ఉన్న వెన్‌లాక్ (చేపల) మార్కెట్ కింద సెల్లార్‌లోకి భారీ ఎత్తున వర్షపు నీరు చేరింది. బెయిల్ అవుట్ చేయాల్సిన అధికారులు స్పందించడం లేదు. వర్షపు నీటిలోనే సెల్లార్ ఉండిపోయింది. పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు నీటిలోనే నానుతున్నాయి.

కొండవీటి వాగు ముంపు



తాడికొండ: గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి ఐతా నాగేశ్వరరావు తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో కొండవీటి వాగు పొంగి పొర్లడంతో నీట మునిగిన వరి, పత్తి పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. వాగుకు ముళ్ళపొదలు, చెత్త అడ్డుపడి నీరు కిందకు ప్రవహించక పొంగిపొర్లి పంట పొలాల మీద వరద పడినట్టు స్థానిక రైతులు తెలియజేశారు. వాగు పక్క పొలాలలో 150 ఎకరాలలో వరి వెద పద్ధతిలో విత్తామని, నెల కిందట వేసిన 300 ఎకరాల పత్తి సాగు కూడా మునిగిపోయిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి వాగులో అడ్డుపడిన చెత్తను తొలగింపచేస్తామని, రాయితీపై వరి విత్తనాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు, తాడికొండ మండలం వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసనాయక్, రైతులు పాల్గొన్నారు.

568.30 అడుగులకు సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 568.30 అడుగులకు చేరింది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నరసరావుపేట మున్సిపాలిటీకి 14వ ర్యాంకు



నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో స్థానిక మున్సిపాలిటీకి 14వ ర్యాంకు లభించిందని కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం పేర్కొన్నారు. గతేడాది 18వ ర్యాంకు వచ్చిందన్నారు. ఈ ఏడాది ర్యాంకు పరంగా పరిస్థితి మెరుగుపడిందన్నారు. దేశ వ్యాప్తంగా 265వ ర్యాంకు సాధించటమే కాకుండా చరిత్రలో తొలిసారిగా ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ఓడీఎఫ్)లో 2పస్ ర్యాంకు లభించిందన్నారు.

పేరేమో రాజధాని ప్రాంతం.. తీరు చూస్తే చినుకుపడితే ఊరంతా చెరువే అన్నట్లు ఉంది. గుంటూరు నగరంలో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న వాననీటితో ప్రజలు నరకం చవిచూస్తున్నారు. గంటల తరబడి మోకాలిలోతు నీటిలో ట్రాఫిక్ మధ్య ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారులు మాత్రం అది చేశాం.. ఇది చేశాం.. అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రత, శాశ్వత పరిష్కారానికి చేసిన ప్రయత్నం శూన్యం.

ఊరంతా నీరు.. కదలరా మీరు?



గుంటూరులోని విద్యానగర్ రోడ్డుపై భారీగా చేరిన వర్షపు నీరు

- గుంటూరు నగరంలో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న వర్షపు నీరు
- గుంటూరు పశ్చిమ నుంచి తూర్పులోకి చేరుతున్న వర్షపు నీరు
- తూర్పులో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపై కనీస దృష్టి పెట్టని అధికారులు
- దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని మొండిగేటు సమస్య
- మూడు వంతెనల వద్ద ట్రాక్ కింద డ్రైనేజీ నిర్మాణం కాగితాలకే పరిమితం

వర్షపు నీటి కష్టాలతో పాలకులు, అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో 210 కిలోమీటర్ల పొడవున డ్రైనేజీలు విస్తరించి ఉన్నాయి. వీటిలో మేజర్‌వి 125.28, మీడియం 67.41, మైనర్ డ్రైనేజీలు16.25 కిలో మీటర్లు. వానాకాలానికి ముందే పూడికతీత చేపట్టాలి. ఈ ఏడాది నేటికీ ఆ పనులు పూర్తికాలేదు. ఇంజినీరింగ్ అధికారులు రూ.4.78 కోట్లతో పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్లు పైపైన పూడిక తీశారు. భారీ వర్షాలకు ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. డ్రైనేజీల్లో పూడికే దీనికి ఓ కారణమని ప్రజలు చెబుతున్నారు. గుంటూరు



కంకరగుంట ఆర్‌యూబీ వద్ద వాననీరు

నగరంలో మురుగు, వాననీరు పోయేందుకు పీకలవాగు, నంది వెలుగు రోడ్డు, సుద్దపల్లిడొంక, పొన్నూరు రోడ్డు, గొట్టాలబజార్, అంబేడ్కర్ వాగులు... ప్రధానమైన డ్రైనేజీలు. ప్రధానంగా పీకలవాగు పశ్చిమ నియోజకవర్గంలోని పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ నుంచి ప్రారంభమై చిన్న చిన్న కాలువలను, మిగతా పెద్ద డ్రైనేజీలను కలుపుతూ బుడంపాడు వరకు ప్రవహిస్తుంది. చుట్టుగుంట శ్రీనివాసరావుపేట నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు కూడా తూర్పు నియోజకవర్గం మీదుగా పొన్నూరు రోడ్డులోని ప్రధాన డ్రైనేజీలోకి కలుస్తుంది. వీటిలో పూడికతీతతో పాటు సక్రమంగా నిర్వహించకపోవడం ప్రస్తుత సమస్యకు కారణంగా ఉంది.

మూడు వంతెనల ప్రాంతంలో..



బ్రిడ్జి వద్ద భారీగా చేరిన వర్షపు నీరు

నగరంలో వర్షం పడితే ప్రధానంగా కంకరగుంట ఫ్లయ్ ఓవర్ అండర్ పాస్, మూడు వంతెనల వద్ద వాననీరు ముంచెత్తుతోంది. ఇటీవల మూడు వంతెనల వద్ద ట్రాక్ విస్తరణ పేరుతో రూ.5.50 కోట్లు వెచ్చించి పనులు చేశారు. వాననీటి సమస్య ఉండదని ప్రజలు భావించారు. కానీ చినుకు పడితే చాలు భారీగా వాననీరు నిలిచిపోతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా రైల్వే ట్రాక్ కింద మరో డ్రైనేజీ నిర్మాణానికి రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ పనులు పూర్తయితే తప్ప ఇక్కడ సమస్య తీరదు. వర్షం పడిన ప్రతిసారీ మోటార్లు వేసి నీటిని బెయిల్ అవుట్ చేసి మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. రైల్వే అధికారులతో సమన్వయంపై కనీసం దృష్టి పెట్టలేదు.

'మొండిగేటు'పై ముందడుగేదీ?

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వాన పడినప్పుడు వర్షపు నీరు ఎక్కువై ఆ ప్రభావం తూర్పు నియోజకవర్గంపై పడుతోంది. పశ్చిమ నుంచి వచ్చే ఈ వరద 3వ వార్డులోని మొండిగేటు నుంచి బయటకు వెళుతుంటుంది. అయితే మొండిగేటు వద్ద చిన్న కల్వర్టు ఉండటంతో అవుట్ ఫాల్ కేవలం 10 శాతం మాత్రమే ఉంది. ఇక కాస్త వ్యర్థాలు అడ్డుపడితే 3, 4, 8వ వార్డుల్లోని పలు కాలనీలు నీట మునిగే అవకాశం ఉంది. మొండిగేటు విస్తరణ కోసం పాలకులు, అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. రైల్వేశాఖకు దీని విస్తరణ నిమిత్తం నగరపాలక సంస్థ నిధులు ఇచ్చింది. అధికారుల సమన్వయ లోపంతో విస్తరణ పనులు ముందుకు సాగలేదు.



మూడవ వార్డులో ఉన్న మొండిగేటు

సగంలోనే ఆగిన డ్రైనేజీ నిర్మాణం

నగరంలో వర్షపు నీరు ఎప్పటికప్పుడు బెయిల్ అవుట్ అయ్యేలా బృందావనం అపార్ట్‌మెంట్ (ఏటుకూరు వెళ్లే రోడ్డు) నుంచి పొన్నూరు రోడ్డులోని డ్రైనేజీకి అనుసంధానంగా 14వ వార్డులో సుమారు 800 మీటర్ల పొడవుతో రూ.3.50 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం భాగాలుగా చేపట్టారు. కబాడీగూడెం 3వ లైను నుంచి 7వ లైను వరకు నిర్మాణం పూర్తయింది. బృందావనం అపార్ట్‌మెంట్ వెనుక నుంచి సంగడిగుంట హిందూ శ్మశాన వాటిక వరకు మరో పార్టుగా నిర్మాణం పూర్తి చేశారు. కబాడీ గూడెం 1 నుంచి 3వ లైను, బృందావనం అపార్ట్‌మెంట్ పక్కన సుమారు 250 మీటర్ల పొడవు మేర పనులు ఆక్రమణల కారణంగా ఆగిపోయాయి. ఈ డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే 14వ వార్డులోని పలు కాలనీలు నీటి ముంపు నుంచి బయటపడే అవకాశం ఉంది.



14వ వార్డులో సగం నిర్మించి వదిలేసిన డ్రైనేజీ



ప్రత్తిపాడు మండలం వంగిపురంలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

ముంచిన వరుణుడు

అన్నదాతల ఆశలపై వరుణుడు 'నీళ్లు' చల్లాడు. ఇటీవల వర్షాలతో మొలక దశలో ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. నీరు బయటకు పంపే మార్గం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. వాన తగ్గితేనే కాస్త ఊరట లభిస్తుందని వారు చెబుతున్నారు. ఇక ఈ వర్షాలతో వాణిజ్య పంటలకు మేలు చేకూరింది.

- భారీవర్షాలతో నీటిలోనే పంట పొలాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- వాణిజ్య పంటలకు కాస్త ఊరట

ప్రత్తిపాడు / కొల్లిపర: ప్రత్తిపాడు మండలం వంగిపురం పరిసర ప్రాంతాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో అన్నదాతలు వెద పద్ధతిలో వరి సాగు చేశారు. ఇప్పటికే 400 ఎకరాల్లో మొలకలు వచ్చాయి. ప్రస్తుత వానతో అవి నీట మునిగాయి. 170 ఎకరాల్లో పత్తి, 120 ఎకరాల్లో మినుము సాగు చేశారు. వట్టిచెరుకూరు మండలంలో 8 వేల ఎకరాలకుగాను 3 వేల ఎకరాల పంట వాన నీటిలో నానుతోంది. 50 ఎకరాల్లో పత్తి నీట మునిగింది. పెదనందిపాడు మండలంలో 700 ఎకరాల వరి పొలాలు నీట మునిగాయి. పత్తి 155 ఎకరాలు నీటిలోనే ఉంది. సోయాబీన్ 150 ఎకరాల్లో సాగు చేశారు. కాకుమాను మండలంలో 19 వేల ఎకరాల్లో వరి ప్రస్తుతం నీట నానుతోంది. పంటపై రైతులు ఆశలు వదులుకోవలసిన పరిస్థితి. విత్తనాలపై ప్రభుత్వం కేజీకి రూ. 5 మాత్రమే సబ్సిడీ ఇచ్చింది. వాన దెబ్బకు కోలుకోవాలంటే కనీసం కేజీకి యాభై శాతం రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

డెల్టా రైతుల ఆవేదన

మరోవైపు వరి రైతుల పరిస్థితి డెల్టా ప్రాంతంలో అగమ్య గోచరంగా తయారైంది. కొల్లిపర మండలంలో వరి నాట్లు పూర్తి చేశారు. వానలు లేక బోర్లు ద్వారా నీరు అందించారు. ఇప్పటివరకు నారుమళ్లు ఎండితే.... నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు నీట మునిగాయి. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, అత్తోట, దావులూరు, తూములూరు తదితర గ్రామాలల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కుళ్లి పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా భారీ వర్షం పడుతుండటంతో పల్లపు చేలల్లో నీరు బయలు వెళ్లడం లేదు. వెద పద్ధతి ద్వారా ఎకరానికి సుమారు రూ. 6 వేలు ఖర్చు పెట్టారు. నీరు బయటకు పంపటానికి, మళ్లీ వరి నారు కొనుగోలుకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




కొల్లిపర వద్ద చెరువును తలపిస్తున్న వరి పొలాలు

ఊపిరి పోసుకున్న వాణిజ్య పంటలు

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని అరటి, పసుపు, నిమ్మ, బొబ్బాయి, కూరగాయలు వంటి వాణిజ్య పంటలు ఊపిరి పోసుకున్నాయి. కొల్లిపర మండలంలో వరి 5,200, అరటి 400, పసుపు 350, కూరగాయలు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

నీరు బయటకు పంపాలి



వరి నాట్లు వేసిన రైతులు ఈ వర్షాలకు భయపడాల్సిన అవసరం లేదు. మొలక కనిపించే వరకు వర్షపు నీటిని బయటకు పంపించాలి. నాలుగు రోజుల తరువాత ఇతర జాతుల గడ్డి ఉంటే ఎదిగిన వరిలో వినియోగించే గడ్డి మందు పిచికారీ చేయాలి. 15 నుంచి 20 రోజుల తరువాత కుళ్లిపోయిన వరి మొక్కలు ఉన్న ప్రదేశంలో నారు కొనుగోలు చేసి పై నాటు వేయాలి.

– ఎస్.శ్రీనివాసరెడ్డి, ఏవో, కొల్లిపర మండలం

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- కల్వర్టు స్లాబ్ నిర్మాణంలో ప్రమాదం జరగడంతో కార్మికుడు మృత్యువాత
- తప్పు తమది కాదని తప్పుకొన్న కార్పొరేషన్ అధికారులు
- పరిహారం కూడా కాంట్రాక్టరే ఇవ్వాలని ప్రతిపాదన
- ప్రాణాలకు విలువ ఇవ్వని యంత్రాంగం



పనులు చేపట్టిన ప్రాంతం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్వాకానికి ఒక నిండు ప్రాణం బలైంది. ఒక పక్క కుండపోత వర్షాలు కురుస్తున్న సమయంలో పీకలవాగుపై చప్టాకి స్లాబ్ వేయాలన్న నిర్ణయం ఎవరిదన్న విషయం తేలాల్సి ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పీకలవాగు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రవహించింది. ఈ వాగుపై వేసిన సెంట్రింగ్ గట్టితనం ఎంత ఉందనే విషయాన్ని పరిశీలించకుండానే మంగళవారం స్లాబ్ వేయాలని నిర్ణయించారు. అది కూడా 18 అంగుళాలు వేయడంతో బరువు తట్టుకోలేక స్లాబ్ కుప్పకూలింది. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేయడం వెనుక కార్పొరేషన్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. నగరంలోని 34వ డివిజన్ పరిధిలోని దేవాపురం 4వ లైనులో పీకలవాగుపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరువైంది. దాని స్థానంలో కొత్తది నిర్మించేందుకు నిర్ణయించారు. రూ.8 లక్షలతో నూతన కల్వర్టు పనులను ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. కొద్ది రోజులుగా వర్షం పడుతున్నప్పటికీ కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి తీసుకురావడంతో మంగళవారం స్లాబ్ వేశారు. అది పూర్తయిన తరువాత కింద పెట్టిన సెంట్రింగ్ కర్రలు పరిశీలించేందుకు గుంటూరు నగరం గోరంట్లకు చెందిన తోట అప్పారావు వెళ్లాడు. అకస్మాత్తుగా సెంట్రింగ్ కర్రలు కదిలి స్లాబ్ పడిపోయింది. ఊపిరి ఆడక అప్పారావు మృతి చెందాడు.

వాన పడుతుంటే పనులా?

మూడు రోజులుగా నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇంకో రెండు రోజులపాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ చెబుతున్నారు. కానీ కాంట్రాక్టర్, అధికారుల వైఖరితో మంగళవారం హడావుడిగా స్లాబ్ వేశారు. వాగులో నిరంతరం మురుగునీరు పారుతున్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. తూతూ మంత్రంగా పనులు చేయడంతో ఆకస్మాత్తుగా ప్రమాదంలో కార్మికుడు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. మామూలుగా ఇళ్లకు 4 నుంచి 5 అంగుళాలు స్లాబ్ వేస్తారు. కల్వర్టు వద్ద మహా అయితే 8 అంగుళాలు శ్లాబ్ వేస్తారు. కానీ ఇప్పుడు దుర్ఘటన జరిగిన పీకలవాగుపై 18 అంగుళాలు మందం స్లాబ్ వేసినట్లు సమాచారం. అలా వేయాలంటే కింద ఐరన్ సెంట్రింగ్ ఉండాలి. ఇక్కడ చెక్క సెంట్రింగ్ వాడటంతో ప్రమాదం జరిగిందని వర్కర్లు చెబుతున్నారు.

నాణ్యతకు పాతర

గుంటూరు నగరంలో జరిగే వర్కులను టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లే చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఎవరైనా తమని కాదని వర్కులు చేస్తే బిల్లులు ప్రాసెస్ కానివ్వబోమని బెదిరిస్తున్నారు. చాలా మంది కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఏ పనైనా నాణ్యతా ప్రమాణాలు లేకుండానే చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో కూడా 'టెండర్లన్నీ కొట్టేసి.. పనుల్లో నొక్కేసి..' అనే కథనం ప్రచురితమైంది. అధికారులు మాత్రం పచ్చ కాంట్రాక్టరే జీ హుజూర్ అంటూ వారి చేసిన వర్కుల్లో నాణ్యత లేకపోయినప్పటికి కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరికి కాంట్రాక్టర్‌తో బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం ఇప్పించేందుకు ఒప్పించారు.

పూర్తిగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే

వర్షాలు పడుతున్నప్పటికీ కాంట్రాక్టర్ పీకలవాగు మీద స్లాబ్ వేశారు. కనీసం రక్షణ పరికరాలు వాడకుండా నాసిరకంగా పనులు చేస్తున్నారు. తూతూ మంత్రంగా స్లాబ్ వేస్తున్న క్రమంలో అక్కడ పనిచేస్తున్న కార్మికుడు చనిపోయాడు. దీనికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం.

– బూసి రాజలత, 34వ డివిజన్ కార్పొరేటర్

కాంట్రాక్టర్‌దే బాధ్యత



అప్పారావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

జీజీహెచ్‌లో మృతదేహాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన కమిషనర్ పులి శ్రీనివాసులు అంతా కాంట్రాక్టర్‌దే బాధ్యత అన్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ వైపు ఎటువంటి తప్పిదం లేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. క్వాలిటీ కంట్రోల్ సర్టిఫై చేసిన తరువాత పనులు చేపట్టామన్నారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించేందుకు మేయర్, ఎమ్మెల్యేతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నప్పటికీ వర్కు చేయడంతోపాటు సరైన రక్షణ చర్యలు లేవన్నారు. కార్మికుడు చనిపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నష్ట పరిహారం చెల్లించి సర్వే చేసుకోండి

జేసీకి తెగేసి చెప్పిన కొప్పురావూరు రైతులు

గుంటూరు వెస్ట్: నష్టపరిహారం చెల్లించేంత వరకు తమ భూములు సర్వే చేయడానికి వీలు లేదని పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన రైతులు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజకు తెగేసి చెప్పారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో కొప్పురావూరు రైతులతో జేసీ సమావేశమయ్యారు. వివరాల్లోకి వెళితే. ఎర్రపాలెం–నంబూరు మధ్యలోని రైల్వే లైను కోసం రైల్వే శాఖ సర్వే నిర్వహించేందుకు తలపెట్టింది. అయితే ఈ లైను కొప్పురావూరు మీదుగా వెళుతుంది. దీంతో స్థానిక రైతులు తమకు నష్టపరిహారం చెల్లించేంత వరకు తమ భూముల్లో సర్వే చేయడానికి అంగీకరించబోమని తెగేసి చెప్పారు. దీంతో జేసీ మాట్లాడుతూ ముందు సర్వే చేయనివ్వండి, ఎంత భూమి అవసరమవుతుందో, ఎవరెవరి భూమి అవసరమవుతుందో లెక్క తేలిన తరువాత రైతుల అభిప్రాయాలు ఉన్నతాధికారులకు పంపుతామని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కొందరు ఒప్పుకోగా, అధిక శాతం మంది దీన్ని నిరాకరించారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి
- రేంజ్‌కు 53 మంది పీఎస్‌ఐలు కేటాయింపు



పీఎస్‌ఐలతో మాట్లాడుతున్న సర్వశ్రేష్ఠత్రిపాఠి

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయతీ, సేవాతత్పరతతో మెలగాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ సివిల్ ఎస్‌ఐ (పీఎస్‌ఐ)లు 53 మంది మంగళవారం గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని మర్యాద పూర్వకంగా కలిశారు. పీఎస్‌ఐలను ఉద్దేశించి ఐజీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్లను నిర్వహించే విధానాలు, రికార్డులు, చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 53 మంది ఎస్‌ఐలలో 36 మంది పురుషులు, 17 మంది మహిళా ఎస్‌ఐలు రిపోర్ట్ చేశారు. గుంటూరు జిల్లాకు 23, పల్నాడు జిల్లాకు 13, బాపట్ల జిల్లాకు 10, ప్రకాశం జిల్లాకు ఒక్కరు చొప్పున, శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాకు ముగ్గురు, తిరుపతికి ముగ్గుర్ని కేటాయించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

నగరంపాలెం: ప్రొబేషనరీ సివిల్ ఎస్‌ఐ (పీఎస్‌ఐ)లు సమర్థంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గుంటూరు జిల్లాకు కేటాయించిన 23 మంది పీఎస్‌ఐలు, ఉద్యోగోన్నతి పొందిన ఆరుగురు ఎస్‌ఐలు మంగళవారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన, సేవా గుణం కీలకమని అన్నారు.



పీఎస్‌ఐలు, ఎస్‌ఐలతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 786

కొమ్ములు : 435 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,500	10,400

కాయలు : 351 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	9,000	10,400

మొత్తం అమ్మకాలు : 589.500 క్వింటాళ్లు

-దుగ్గిరాల

సమాజంలో సమానత్వమే పీ–4 లక్ష్యం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: పేదరిక నిర్మూలన కోసం సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ–4 పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో బంగారు కుటుంబాల కోసం స్వల్ప కాలిక, దీర్ఘకాలిక సహాయాలను మార్గదర్శులు మళ్లించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఇప్పటికే లక్ష వరకు బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం గ్రామ సభల ద్వారా వారికి కావాల్సిన అవసరాలను సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. ఆగస్టు నాటికి బంగారు కుటుంబాల పూర్తి వివరాలు అందుతాయని చెప్పారు. మార్గదర్శులు వారి పరిసర ప్రాంతాల్లోనే వ్యక్తిగతంగా కనీసం ఒక కుటుంబాన్ని, సంస్థలు ఐదు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లోగానీ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులను సంప్రదించాలన్నారు. పీ4 వెబ్‌సైట్ లోనూ మార్గదర్శిగా రిజిస్టరైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. జేసీ మాట్లాడుతూ ఉన్నత వర్గం వారు అవకాశం ఉన్నంత వరకు విద్య, వైద్యంతోపాటు, ముఖ్యమైన అవసరాలు కావాల్సిన వారికి తీర్చాలన్నారు. డీఈఓ రేణుక, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డెప్యూటీ స్టాటికల్ అధికారి శౌరిరాజు, డీపీఓ శేషశ్రీ, పాల్గొన్నారు.

ఈసీ మార్గదర్శకాలను అమలు చేయాలి

డీఆర్వో షేక్ ఖాజావలి



మాట్లాడుతున్న షేక్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: భారత ఎన్నికల సంఘం గతంలో నిర్వహించిన విధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించిన ఓటర్ల జాబితాను రూపొందించాలన్న ఆలోచనలో ఉందని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి తెలిపారు. దానికి అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ.. దీనిపై త్వరలోనే ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విడుదల చేస్తుందన్నారు. పూర్తి సమాచారం అందిస్తామని తెలిపారు. పోలింగ్ బూత్‌లలో 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా, అదనంగా ఉండే ఓటర్లను సమీపంలోని పోలింగ్ బూత్‌లలో సర్దుబాటు చేసేలా ప్రక్రియను ప్రాథమికంగా పూర్తి చేశామన్నారు. దీనిపై నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలతో చర్చించి ఆమోదం కోసం ఎన్నికల సంఘానికి పంపిస్తామని తెలిపారు. బీఎల్వోల మార్పుచేర్పులకు ఇక నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. దీనికోసం ఈ నెల 31వ తేదీ నాటికి వివరాలు ఎన్నికల సంఘానికి పంపిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీలు నియమించే బూత్ లెవెల్ ఏజెంట్ నియామకాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆమోదం తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్ఏల వివరాలు అందించాలని డీఆర్వో వివరించారు. సమావేశంలో విపత్తులు నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మీ కుమారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగారాజు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జీఎంసీ అడిషనల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మల్లేశ్వరి పాల్గొన్నారు.



మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	52,273
అమ్మకాలు	51,209
నిల్వ	7,316

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,400
341	10,000–13,500
273	9,800–12,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,500
నంబరు–5	10,000–13,600
341	10,000–13,600
4884	10,000–12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,000
బాడిగ–355	10,000 – 12,400
దేవనూరు డీలక్స్	10,000 – 12,500
ఆర్మూర్	9,600 – 11,000
తాలుకాయలు	5,000 – 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,800
బాడిగ – 355	10,000–12,500
దేవనూరు డీలక్స్	10,000 – 12,600
తాలు	5,200 – 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

కారు అద్దాలు పగలకొట్టి చోరీ

రెండు ల్యాప్‌టాప్‌లు, నగదు అపహరణ



కారు అద్దాలు పగలకొట్టి బ్యాగ్‌ను చోరీ చేసి తీసుకెళుతున్న వ్యక్తి

మంగళగిరి టౌన్ : రెండు వేర్వేరు కారుల అద్దాలు పగలకొట్టి ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన ఘటన మంగళగిరిలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు డీబీఎస్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హెడ్ శ్రీనివాస్ సిల్వరాజ్ విధులు నిమిత్తం విజయవాడ బ్యాంకుకు వచ్చారు. అక్కడ పని ముగించుకుని విజయవాడ క్లస్టర్ హెడ్ సుధాకర్‌తో పాటు తన సిబ్బందితో గుంటూరు బ్యాంకుకు బయలుదేరారు. ఈ క్రమంలో మధ్యాహ్నం భోజనం చేసేందుకు చినకాకానిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న భోజన హోటల్ వద్ద ఆగారు. అదే సమయంలో బద్వేల్‌కి చెందిన సాయిరాం అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో ఎర్రబాలెంలో తాను కొనుగోలు చేసిన స్థలం చూడడానికి వచ్చి భోజనం చేసేందుకు వీరు కూడా వారి కారులో హోటల్‌కు చేరుకున్నారు. వీరిద్దరూ కార్లను పార్కింగ్ చేసి భోజనం చేయడానికి లోపలికి వెళ్లారు. భోజనం చేసి అనంతరం బయటకు వచ్చి చూడగా కారు అద్దాలు పగలకొట్టి ఉండడం గమనించారు. కారు లోపల పెట్టిన ల్యాప్‌టాప్, బ్యాగులు అపహరణకు గురిఅయినట్లు గుర్తించారు. శ్రీనివాస్ సెల్వరాజ్ కారులో ల్యాప్‌టాప్‌తో పాటు క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు ఉన్నాయని, సాయిరామ్ కారులో ల్యాప్‌టాప్‌తో పాటు సుమారు 5 వేల రూపాయలు నగదు, ఇంటి తాళాలు, బీరువా తాళాలు ఉన్నట్లు చెప్పారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.



దుండగులు పగలగొట్టిన కారు అద్దం

ఒకరోజు శాస్త్రవేత్తలుగా పాఠశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం లింగిసెట్టి సాంబయ్య

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9వ తరగతుల విద్యార్థులు ఐదుగురు జాతీయ స్థాయి వన్డే యాజ్ ఏ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం లింగిసెట్టి సాంబయ్య మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన బి.అనుశ్రీ,, షేక్ ఖాసీం, షేక్ మస్తాన్‌వలి, కె.ప్రశాంత్, షేక్ అన్వర్‌లను ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఎంపిక చేశారని చెప్పారు. జిగ్యాసా ప్రోగ్రామ్‌లో భాగంగా దేశంలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థ (భువనేశ్వర్)లో ఈ నెల 24న విద్యార్థులు అక్కడున్న శాస్త్రవేత్తలతో కలిసి పనిచేస్తారని తెలిపారు. విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.నాగరాజులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రామాంజనేయులు, రాజులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఉద్యోగి మృతి



ఘటనా స్థలంలో జాన్‌బాబు మృతదేహం

తెనాలి రూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు ఆర్ అండ్ బీ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న జాన్‌బాబు(50) మంగళవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. జాన్‌బాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఘటనాస్థలిని రైల్వే పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రిబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



దినేష్ మృతదేహం

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన దినేష్ (20) మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కళాశాల నుంచి తన స్నేహితుడు గణేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గుంటూరుకు బయలుదేరాడు. చౌడవరం వద్ద హైవేపై డివైడర్ రైలింగ్‌కు ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొంది. దినేష్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు వచ్చి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రేవులో పడి వ్యక్తి మృతి



బాలకోటయ్య మృతదేహం

నిజాంపట్నం: వేటకు వెళ్తూ ప్రమాదవశాత్తు రేవులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. అడవులదీవి ఎస్ఐ బాబూరావు వివరాల మేరకు కొత్తపాలెం పంచాయతీ శారదానగర్‌కు చెందిన బాల కోటయ్య (23) సముద్రంలో వేటకు వెళ్లేందుకు సోమవారం రేవులో పడవపై వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి రేవులో పడ్డాడన్నారు. గల్లంతైన బాలకోటయ్య మృతదేహాన్ని మంగళవారం రేవు ఒడ్డున గుర్తించామన్నారు. మృతుని సోదరుడు బాల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాపు దగ్ధం

మేదరమెట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలోగల టైలర్ దుకాణం సోమవారం అర్ధరాత్రి మంటల్లో కాలిపోయింది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు.. సోమవారం రాత్రి దుకాణం తలుపులు వేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో స్థానికులు ఫోన్ చేసి షాపులో మంటలు వస్తున్నాయని చెప్పటంతో అక్కడకు వచ్చే సరికి దుకాణం పూర్తిగా కాలిపోయింది. దుకాణంలో ఉన్న బట్టలు, సామాగ్రి దగ్ధమయ్యాయని.. వాటి విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని వాపోయాడు.

లారీని ఢీ కొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల: ఆగిఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన టాటాఏస్ ఆటో ఢీ కొన్న సంఘటన జాతీయ రహదారిలోని పి.గుడిపాడు గాజు ఫ్యాక్టరీ వద్ద మంగళవారం జరిగింది. బెంగళూరు నుంచి విజయవాడకు వెళుతున్న కొరియర్ లారీ పి.గుడిపాడు జాతీయరహదారి గాజు ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంది. ఒంగోలు వైపు నుంచి వస్తున్న టాటా ఏస్ ఆటో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన ఆటో ఆగిఉన్న లారీని ఢీ కొంది. దీంతో లారీలోని డ్రైవర్‌కు.. ఆటో డ్రైవర్‌కు గాయాలు కాగా 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

108 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా యాత్ర



సత్తెనపల్లి: త్రివర్ణ పతాకాన్ని జాతీయ జెండాగా భారత రాజ్యాంగ సభ 1947 జూలై 22న ఆమోదించిన సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ (సతెనపల్లి)ఆధ్వర్యంలో నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో 108 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా యాత్ర ర్యాలీ మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడుతూ.. జాతీయ జెండా భారత దేశం యొక్క సార్వభౌమత్వం, ఐక్యతకు చిహ్నమన్నారు. సత్తెనపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆళ్ల సాంబయ్య మాట్లాడుతూ త్రివర్ణ పతాకం భారతీయులకు అందించిన పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. తొలుత పంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, పాఠశాల పీడీ సాంబశివరావు, చెంబేటి బోల్లయ్య, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు అక్షయ్, నిర్మల్ కుమార్, జాతీయ జెండా వేషధారి శేఖర్, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, వాణి, జ్యోతి, అమల, గౌసియా, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి



లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థి



ఆయా జిల్లాల నుంచి వర్సిటీకి చేరుకున్న విద్యార్థులు

పెదకాకాని(ఏఎన్‌యూ): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ జరిగింది. 2025–26 సంవత్సరానికి గానూ 4, 5 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఎంపిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక ప్రక్రియను వర్సిటీ వ్యాయామ విద్యాశాఖ నిర్వహించింది. వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ వివరాలు తెలియజేస్తూ.. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా జిల్లా స్థాయిలో ఎంపికైన 96 మంది విద్యార్థులు, 40 మంది విద్యార్థినీలు మొత్తం 136 మందికి గానూ 122 మంది హాజరయ్యారని అన్నారు. వారిని పలు అంశాల్లో పరీక్షించారు. కార్యక్రమానికి డైరెక్టర్‌లు రమణారావు, రవీంద్రనాథ్ హాజరయ్యారు. విద్యార్థుల సామర్థ్య పరీక్షలను వ్యాయామ విద్యాపరిశోధకులు నిర్వహించగా విద్యార్థులు సహాయ సహకారాలు అందించారు. ఈ పోటీల్లో నిర్ణీత ప్రమాణాలు సాధించిన వారు మాత్రమే డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కు ప్రవేశం పొందుతారన్నారు.

7 నుంచి సీపీఐ మహాసభలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా సీపీఐ మహాసభలను ఆగస్టు 7, 8 తేదీలలో వినుకొండలో నిర్వహిస్తున్నట్టు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. అరండల్‌పేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా నిర్వహిస్తున్న ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. 7వ తేదీన వినుకొండ ప్రధాన వీధుల్లో ర్యాలీ, సాయంత్రం 4 గంటలకు శివయ్య స్థూపం వద్ద బహిరంగ సభ, 8వ తేదీన ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.